
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
బుధవారం, 26 జూన్ 2024





బాధ్యతలు చేపట్టిన అభిషేక్

- కొత్త కమిషనర్‌కు స్వాగతం పలికిన అధికారులు
- మేయర్ నీరజతో మర్యాదపూర్వకంగా భేటీ

7

- ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల వెనుక అభయహస్తాలు
- పాతుకుపోయిన సిబ్బంది.. అంతా వారిదే పైచేయి
- ఇష్టారాజ్యంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలు
- వేలిముద్ర వేసేవారిని కేటగిరీ-2కు మార్చిన వైనం
- దొంగ అసెస్‌మెంట్లలో ఇంటి దొంగలపై చర్యలు కరువు
- ఇంజనీరింగ్ విభాగం పనులపై విజిలెన్స్

ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్యకు అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. నగర పరిధిలో ఖాళీ స్థలాలకు, ప్రభుత్వ స్థలాలకు ఇంటి అసెస్‌మెంట్లు చేయడం, ఇష్టారీతిలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలు జరపడం, కేటగిరీలు మార్చి జీతాలు పెంచడం, టౌన్ ప్లానింగ్‌లో మాస్టర్‌ప్లాన్ మార్చి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, సర్వే నెంబర్లు మార్చి నిర్మాణాలు చేస్తున్నవారికి అండగా ఉండటం, ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన రూ. 1200 కోట్ల పనులపై అవినీతి ఆరోపణలు రావడం.. ఇలా అనేక అంశాలు నగర పాలక సంస్థకు మకిలి పట్టించాయి. వీటిపై ఇంతవరకు ఎలాంటి విచారణలు జరగలేదు. ఆయా అక్రమాలపై చర్యలు తీసుకోవడంతోపాటు, అక్రమార్కులకు సహకరించే అధికారులున్న కార్యాలయాన్ని అభిషేక్ అగస్త్య ఎలా చక్కదిద్దుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



కొత్త సార్ ముందు ఎన్నో సవాళ్లు..

అక్రమాలకు కేరాఫ్‌గా మారిన ఖమ్మం నగరపాలక సంస్థ

ఖమ్మం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకంపై కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. కొందరు అధికారులు ఐడీ గారడీ ప్రదర్శించి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను అలాగే ఉంచి, ఖాళీ అయిన పోస్టుల్లో కొత్తవారిని నియమించి వారికి కొత్త ఐడీ నెంబర్లను కేటాయించి విధుల్లోకి తీసుకుని అక్రమాలకు పాల్పడినట్టు విమర్శలున్నాయి. ఆయా సభ్యుల పేర్లను పే షీట్‌లోకి ఎక్కించి నెల వారీ జీతాల చెల్లింపు కార్యక్రమాలకు కొందరు ఇంటిదొంగలు శ్రీకారం చుట్టారన్న విమర్శలున్నాయి. గడిచిన రెండేళ్లలో సుమారు 130మంది వరకు ఉద్యోగులను ఐడీ నెంబర్లు మార్చి అధికారులను ఏమార్చారన్న ప్రచారం జరిగింది. అందులో కొందరు జవాన్లు కూడా ఉండటం గమనార్హం. ఇందుకోసం ఒక్కో ఉద్యోగి నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా ఆరోపణలు ఉండగా, ఇందుకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయంలోని ఉద్యోగులపై కూడా కేసు నమోదైంది. అంతేకాదు అక్రమంగా అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టారంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ కూడా జరిగింది. ఈ విషయమై కొత్త కమిషనర్ ఎలా స్పందిస్తారో చూడాలి.



అసెస్‌మెంట్లు.. అక్రమార్కులకు అధికారాలు

ఖమ్మం నగరపరిధిలోని ప్రభుత్వ భూములకు, ఇతర ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించి అందినకాడికి దండుకున్నారు కొందరు ఇంటి దొంగలు. ఈ దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. దాంతో ఉన్నతాధికారులు గతేడాది ప్రారంభం నుంచి వేసిన అసెస్‌మెంట్ల వివరాలను బిల్ కలెక్టర్లతో మరోసారి విచారణ చేయించారు. ఆ సమయంలో అసెస్‌మెంట్లు వేయించుకున్న ఎనిమిది మందిపై రెండు కేసులు కూడా నమోదు చేయించారు. విచారణలో 36వరకు మాత్రమే అసెస్‌మెంట్లు బయటపడ్డాయనీ వెల్లడించారు. అయితే ఇంటిదొంగలు వేసిన దొంగ అసెస్‌మెంట్లు గుట్టుచప్పుడు కాకుండా డియాక్టివేట్ చేశారు. దీనికి సంబంధించిన విచారణ కూడా కదలని పరిస్థితి. ఇదిలా ఉంటే 58,59 జీవోల

(మిగతా 6వ పేజీలో)



రామసహాయం రఘురాంరెడ్డి అనే నేను...

ఖమ్మం ఎంపీగా గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు. 'ఐ రామసహాయం రఘురాంరెడ్డి..' అంటూ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేసిన ఆయన... చివరగా జైహింద్...జై తెలంగాణ.. జై సమ్మిధాన్ అంటూ నినాదాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

మా హెచ్‌ఎం మాకు కావాలి..

- సిరిపురంలో విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి
- ప్రమోషన్‌పై బదిలీ అయిన ఉపాధ్యాయుడి కోసం ధర్నా



మా హెచ్‌ఎం మాకు కావాలంటూ మధిర మండలం సిరిపురం గ్రామంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

6

విద్య, వైద్యమే ఏజెన్సీలో కీలకం

- సీజనల్ వ్యాధులు, వరదలే ప్రధాన సమస్య
- నూతన పీవోపై గిరిజనం కోటి ఆశలు
- ఐటీడీఏ నూతన పీవోగా బాధ్యతలు చేపట్టిన రాహుల్



పీవోను సన్మానిస్తున్న అధికారులు

భద్రాచలం, జూన్ 25: తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఐటీడీఏగా పేరుపొందిన భద్రాచలం ఏజెన్సీ పరిధిలో విద్య, వైద్యమే కీలక సమస్యలుగా ఉన్నాయి. వీటి పరిష్కారం పైనే కొత్తగా ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌పై గిరిజనులు ఆశలు పెట్టుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యా సంస్థలు, వైద్యశాలలు పూర్తిస్థాయిలో బలోపేతమైతేనే గిరిజనులకు విద్య, వైద్యం అందుతాయని వారు భావిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 32 మండలాల్లో 5.23 లక్షల మంది గిరిజనులు నివసిస్తుండగా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ గ్రాంట్ల ద్వారా రావాల్సిన నిధులను సత్వరం రాబట్టి చేయూతనందించేందుకు పీవో కృషి చేస్తారనే ఆశతో ఉన్నారు.

అదే ఒరవడిని కొనసాగిస్తారా?

ఇటీవల వరకు పీవోగా బాధ్యతలు నిర్వహించిన ప్రతీక్‌జైన్ ఏజెన్సీలో విద్య, వైద్యరంగాల బలోపేతానికి తనదైన శైలిలో కృషి చేశారు. రాబోయే రోజుల్లో నూతన పీవో సైతం ఇదే ఒరవడిని కొనసాగించాలని గిరిజన సంఘాల నాయకులు ఆశిస్తున్నారు. 17 గిరిజన వసతి గృహాలు.. ఆశ్రమ పాఠశాలలుగా రూపాంతరం చెందగా వాటికి ఇంతవరకు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్వతహాగా విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చే రాహుల్ ఆశ్రమాలు, గురుకులాల్లో మరింతగా విద్య పరిమళాలు పెంపొందించాలని గిరిజనులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణే కీలకం

ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పూర్తిస్థాయి ప్రణాళిక ఎంతో అవసరం. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 38 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు ఉన్నాయి. అదే విధంగా భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలు, అశ్వారావుపేట, పాల్వంచ, వెంకటాపురం, చర్ల, బూర్గంపాడు, ఇల్లెందు, జూలూరుపాడు సీహెచ్‌సీలున్నా వాటిలో పలురకాల సమస్యలు రోగులకు సేవలందించడానికి ప్రతిబంధకంగా మారుతున్నాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని భద్రాచలం ఏరియా వైద్యశాలకు నిత్యం వందలాది మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తూ ఉంటారు. కానీ ఇక్కడ పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. గర్భిణులకు స్కానింగ్ నిర్వహించేందుకు రేడియోలాజిస్టు లేకపోవడంతో నిరుపేదలు ప్రైవేటుగా స్కానింగ్‌లు నిర్వహించుకోవాల్సి రావడంతో వారిపై ఆర్థికభారం పడుతోంది.

చాలా ఇష్టంతో ఐటీడీఏ పీవోగా వచ్చా

పీవోగా బాధ్యతలు చేపట్టిన రాహుల్

భద్రాచలం ఐటీడీఏ నూతన పీవోగా బి.రాహుల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి ఏజెన్సీలోని గిరిజనులకు సేవ చేసేందుకు చాలా ఇష్టంతో వచ్చానని తెలిపారు. తాను గతంలో కొద్ది రోజులపాటు ఖమ్మం కేంద్రంలో శిక్షణ ఐఏఎస్‌గా బాధ్యతలు నిర్వహించిన అనుభవంతో ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. మంచిర్యాలకు సమీపంలోనే ఉట్నూరు ఐటీడీఏ ఉండటంతో తనకు సమస్యలపై అవగాహన ఉందని పేర్కొన్నారు. తాను విద్యకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు లెర్నింగ్ స్కిల్స్ పెంచడమే తన లక్ష్యమన్నారు. అలాగే ఏజెన్సీలో పోషకాహార లోపంతో బాధపడే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నామన్నారు. జీసీసీ ఉత్పత్తులకు మరింతగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఐటీడీఏలోని వివిధ విభాగాల బాధ్యులతో సమీక్ష నిర్వహించారు.

ఉచితం ఉందా.. లేదా..?



- గత ప్రభుత్వ హయాంలో చేపపిల్లల పంపిణీ
- ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంపై మత్స్యకారుల ఎదురుచూపు
- ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేనే పంపిణీకి కార్యాచరణ

ఖమ్మం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం ప్రారంభమైంది. వర్షాలు ఊపందుకుంటే రేపో మాపో చెరువుల్లోకి నీరు కూడా చేరుతుంది. దాంతో మత్స్యకారులు ఆయా చెరువుల్లో చేపల సాగుకు సమాయత్తమవుతారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చినట్టు ప్రస్తుత ప్రభుత్వం కూడా మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందా లేదా అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యశాఖ అధికారులు కూడా దీనిపై ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు. ఏటా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.300 కోట్ల విలువైన చేపల ఉత్పత్తి జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో 2వేలపైగా చెరువులతోపాటు పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి, తాలిపేరు, కిన్నెరసాని వంటి ప్రాజెక్టు, చెరువు మాధారం, తుమ్మలపల్లి వంటి పెద్ద చెరువులు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌లో ఆయా చెరువులు ప్రాజెక్టుల్లో రూ.5కోట్ల విలువైన చేప పిల్లలను ఉచితంగా వదిలారు.

ఆంధ్రా నుంచి దిగుమతి..

గతంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నా.. అవి పనిచేయకపోవడంతో పూర్తిగా ప్రైవేటుగా టెండర్ల ద్వారా చేపపిల్లలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జిల్లాకు అవసరమైన చేప పిల్లలను టెండర్ల ద్వారా ఆంధ్రా ప్రాంతం నుంచి దిగుమతి చేసి పంపిణీ చేస్తారు. ఆయా మత్స్యసహకార సంఘాల సొసైటీల ఆధ్వర్యంలో చేపలను పెంచి విక్రయించుకొని ఆదాయం పొందుతారు. గత ఏడాది ఖమ్మం జిల్లా పరిధిలోని చెరువులు, ప్రాజెక్టులకు రూ.3.50కోట్ల విలువైన చేపపిల్లలు పంపిణీ చేయగా, భద్రాద్రి జిల్లాలో రూ.ఒక కోటి 50లక్షల విలువైన చేపపిల్లలను వదిలారు. వీటిలో రవ్వ, బొచ్చ, పులస వంటి రకాల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఒక్కో పిల్ల రూ.60పైసల నుంచి ఒక రూపాయి 70పైసల చొప్పున వెచ్చించి తీసుకొచ్చారు. జిల్లాలో 38చోట్ల నర్సరీలుండగా ఆయా కేంద్రాల్లో పిల్లలను అభివృద్ధి చేసి కూడా మత్స్యశాఖ పంపిణీ చేస్తోంది. జిల్లాలో సీడ్‌ఫామ్‌లు అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నా ఆచరణలోకి రావడంలేదు.

ప్రభుత్వం ఇంకా నిధులు కేటాయించలేదు

ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలో చేప పిల్లల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. దీనికోసం ప్రభుత్వం ఇంకా నిధులు కేటాయించలేదు. జిల్లాలోని 903 చెరువులకు 3.61కోట్లు చేపపిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు కేటాయించలేదు. నిధులు రాగానే జూలైలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి మత్స్య సొసైటీలకు చేపపిల్లలను పంపిణీ చేస్తాం. జిల్లాలో 38 నర్సరీల్లో కేవలం 22 మాత్రమే పనిచేస్తున్నాయి.

పకడ్బందీగా ఆహార నాణ్యత తనిఖీ

- ఫుడ్ సేఫ్టీకి రెవెన్యూశాఖ సహకారం
- ఉమ్మడి జిల్లాలో కల్తీ నివారణకు కార్యాచరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 25: ఇక ఆహార పదార్థాలు తనిఖీ మరింత పటిష్టంగా అమలు కానుంది. ఫుడ్ సేఫ్టీ శాఖకు రెవెన్యూశాఖ చట్టాలు తోడు కానున్నాయి. అంగ బలం, ఆర్థిక బలం ఉన్న బడా వ్యాపారులను ఇక క్వాలిటీలో రాజీలేకుండా టచ్ చేయనున్నారు. ఇందు కోసం రాష్ట్ర ఆహార నాణ్యతా ప్రమాణాలశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉమ్మడి జిల్లాలో కల్తీ నివారణకు నిర్దిష్టమైన కార్యాచరణ పంపారు. సిబ్బంది కొరత ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉమ్మడి జిల్లా ఆహార నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారులకు ఇక మీదట జిల్లా రెవెన్యూ అధికారులు అండగా నిలవనున్నారు. జిల్లాస్థాయిలో ఆహార పౌర సరఫరాలను పర్యవేక్షణ చేసే అదనపు కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు తోడుగా నిలవనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్లు, పాల ఉత్పత్తి కేంద్రాలు, స్వీట్ దుకాణాలు, ఇతర ఆహార ఉత్పత్తుల కేంద్రాలపై నిఘా పెట్టనున్నారు. నెలరోజుల కాలంలోనే 80శాతం దుకాణాలను తనిఖీలు చేసేందుకు కార్యాచరణ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆహార నాణ్యతా ప్రమాణాలశాఖ కమిషనర్ స్థాయి నుంచి పటిష్టమైన కార్యాచరణను ఉమ్మడి జిల్లాకు పంపారు. ఏ క్షణమైన ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌తో పాటుగా ఐదుగురు రెవెన్యూ సిబ్బందితో ఆహార తనిఖీ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టనున్నారు. అయితే ఇటీవల తనిఖీలు జరిగిన రెస్టారెంట్‌లు క్వాలిటీ దిశగా పయనిస్తుండగా రైడింగ్ జరగని హోటల్స్ మాత్రం ప్రమాణాలు పాటించటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొణిజర్ల, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో రెండు రోజులపాటు నిర్వహించనున్న మండలస్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు మంగళవారం ముఖ్యఅతిథులుగా తమ్మినేని వీరభద్రంతోపాటు పార్టీ రాష్ట్రనేత పోతినేని సుదర్శన్ హాజరయ్యారు. తమ్మినేనికి, పోతినేనికి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తరువాత వారు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ సింగరేణి బొగ్గుగనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర, తెలంగాణ విడిపోయే సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కేంద్రంపై పోరాడాలని సూచించారు. కేంద్రంలో బీజేపీకి ప్రజావ్యతిరేకత వల్లనే ఇండియా కూటమికి అధికస్థానాలు వచ్చాయన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో ఇప్పటివరకు కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, అయినా ఇంతవరకు లీకేజీకి కారణమైన వారిని శిక్షించలేదన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, తాళ్లపల్లి కృష్ణ, భూక్యా వీరభద్రం, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, పిట్టల రవి, బోయినపల్లి శ్రీనివాసరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, చింతనిప్పు వెంకయ్య, లింగాల దానయ్య, బుర్రి గోపయ్య, మోత్కూరి వెంకటేశ్వరరావు, కొండయ్య, దారగాని రాములు, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో స్క్రాప్ స్కామ్

ప్రభుత్వం మారినా చర్యలు శూన్యం 7

అక్రమాల అడ్డాపై పోలీసు లాఠీ

'సత్తుపల్లి'లో అసాంఘిక కార్యకలాపాల జోరుకు చెక్ 6

గురుకులంలో విద్యార్థిని అదృశ్యం

ఇల్లెందులో బస్టాండ్‌లో గుర్తించిన కుటుంబ సభ్యులు



షిమోగాలో చర్చిస్తున్న రైతు సంఘాల జాతీయ నాయకులు

రైతు వ్యతిరేక నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలి

» సంయుక్త కిసాన్‌మోర్చా చీఫ్ కో ఆర్డినేటర్ జగ్జిత్ సింగ్ దళేవాల్

ఖమ్మం వ్యవసాయం, జూన్ 25: 2020 సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ప్రారంభించి అమలుకు ప్రయత్నించిన మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్‌మోర్చా చీఫ్ కో ఆర్డినేటర్ జగ్జిత్ సింగ్ దళేవాల్ పేర్కొన్నారు. 2002లో కేంద్రం తీసుకువచ్చిన నల్లచట్టాలను ఉపసంహించుకోవాలని కోరుతూ దళేవాళ్ నాయకత్వంలో జాతీయ రైతు నాయకుల బృందం దక్షిణాది రాష్ట్రాలలో పర్యటిస్తోంది. ఈసందర్భంగా కర్ణాటకలోని షిమోగాలో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సమవేశం జరిగింది. ఈసందర్భంగా దళేవాల్ మాట్లాడుతూ నాటి ప్రధాని మోదీ రైతులకు మూడు నల్ల చట్టాలను ఉపసంహించుకుంటూ ఇచ్చిన హామీల అమలు కోరుతూ పంజాబ్, హర్యాన, రైతుల పునర్ ప్రారంభించిన పోరాటానికి దక్షిణాది రైతుల మద్దతుకోరుతూ పర్యటిస్తున్నట్టు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమవేశాలకు ముందు ఢిల్లీలో పదివేల మందితో భారీ రైతు సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జగ్జీత్‌సింగ్ దళేవాల్, శాంతకుమార్, నల్లమల వెంకటేశ్వరరావు, అభిమన్యు, పాండ్యన్, బిజ్జు, మాన్‌సింగ్ పాల్గొన్నారు.



» సత్తుపల్లిలో అసాంఘిక కార్యకలాపాల జోరు
» మట్టి, ఇసుక, బియ్యం రవాణా మాఫియా..
» అక్రమాలకు చెక్ పెడుతున్న పోలీసులు
» దృష్టిసారించిన మంత్రులు, ఎమ్మెల్యే
» సహకరిస్తున్న అధికారిపై ఇప్పటికే చర్యలు

అక్రమాల అడ్డాపై పోలీస్ లాఠీ

సత్తుపల్లి, జూన్ 2: ఆంధ్రా-తెలంగాణా సరిహద్దుల్లో ఉన్న సత్తుపల్లి నియోజకవర్గం పలు అక్రమాలకు పేరుపడింది. గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా జరుగుతున్న అక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు నిలువరిస్తున్నా కొందరు మాత్రం అధికారుల కళ్లుగప్పి మరీ తమ అక్రమ బాట పడుతున్నారు. కొన్నేళ్లుగా క్రికెట్ బెట్టింగ్, పేకాట నిర్వహణ, కోడిపందేల అంశాలతో వార్తల్లో నిలుస్తోంది. దీనికి తోడు ఆంధ్రా నుంచి అక్రమంగా ఇసుకను సరిహద్దులోని సత్తుపల్లి నియోజకవర్గానికి తరలించి పెద్ద ఎత్తున విక్రయిస్తారనే ప్రచారం ఉంది. ఈ ప్రాంతం నుంచి ఆంధ్రాకు తరలివెళ్లే రేషన్ బియ్యం వాహనాలను పలు సందర్భాల్లో అధికారులు పట్టుకున్న సంఘటనలున్నాయి. పోలీసులు డేగకన్నుతో అక్రమార్కుల పనిపడుతున్నారు.

పేకాట, బెట్టింగ్‌లు, పందేలు..

నియోజకవర్గంలో పేకాట వ్యసనం విస్తరిస్తోంది. సరదాగా గ్రామాల్లో ఆడుకునే వారు కొందరైతే వ్యాపార పద్ధతిలో పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి నిర్వహించే వారు కొందరు ఉన్నారు. ఆంధ్రా-తెలంగాణా సరిహద్దుల్లో జోరుగా సాగే కోడిపందేలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గత జనవరి నుంచి పూర్తి స్థాయిలో నిలువరించారు. ఇదే రీతిలో క్రికెట్ బెట్టింగ్‌పై అధికారులు దృష్టిసారించినా గుట్టుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సత్తుపల్లి మండలానికి చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారని తెలిసింది.

బియ్యం, ఇసుక, మట్టి రవాణా..

రాష్ట్రం నుంచి సత్తుపల్లి నియోజకవర్గం మీదుగా భారీ స్థాయిలో రేషన్ బియ్యం కూడా అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు ఆక్రమంగా రవాణా జరుగుతోంది. గతంలో బియ్యం అక్రమంగా తరలిస్తున్న భారీ వాహనాలను పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకున్న సందర్భాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి ప్రాంతానికి పెద్ద మొత్తంలో ఇసుకను కొందరు అక్రమంగా తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రెండేళ్ల క్రితం వరకూ ఆంధ్రా నుంచి సత్తుపల్లి మీదుగా గంజాయి అక్రమ రవాణా చేస్తూ పలు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కఠినంగా వ్యవహరించటంతో గంజాయి వాహనాలు సత్తుపల్లి వైపు రావటం లేదు.

కఠిన చర్యలతో అక్రమాలకు చెక్ పడేనా..

సత్తుపల్లి ప్రాంతంలో బెట్టింగ్, పేకాట స్థావరాల విషయంలో జిల్లాకు చెందిన మంత్రులు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి సీరియస్‌గా ఉన్నారు. ఈ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్, పేకాట, కోడి పందేలు ఇతర అక్రమ వ్యాపారాలు సాగటానికి వీల్లేదని వారు స్పష్టంగా పలు సందర్భాల్లో ప్రకటించారు.

దీనికితోడు ఉన్నతాధికారులు కూడా సత్తుపల్లి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. పేకాట, జూదగృహాల నిర్వాహకులకు సహకరిస్తున్నారనే సమాచారంతో ఒక అధికారిపై చర్యలు తీసుకున్నారు.

సీట్లు అధికం.. చేరికలు స్వల్పం

» ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రవేశాలు అంతంతే
» రెండో దశ దోస్త్ తర్వాత భారీగా మిగిలిన సీట్లు
» నగదు, ఫోన్లు ఎరవేస్తున్న ప్రైవేటు కాలేజీలు
» విద్యార్థులను నేరుగా సంప్రదిస్తున్న ప్రతినిధులు



ఖమ్మం ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు వచ్చిన విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 25: ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ప్రవేశాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న దోస్త్ ప్రక్రియలో రెండో దశ పూర్తి కాగా భారీ సంఖ్యలో గవర్నమెంట్ కాలేజీల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఖమ్మంలో 5, భద్రాద్రి కొత్తగుడెంలోలో 5 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలోని ఐదు కళాశాలల్లో 2,280 సీట్లు, ఖమ్మం జిల్లాలోని ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 3,120 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఖమ్మం జిల్లాలోని ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ డిగ్రీ కళాశాలలో మొత్తం సీట్లు 1,560కి గాను మొదటి దశలో 734 మందికి సీట్లు ఎలాట్ కాగా కేవలం 450 మంది విద్యార్థులే సెల్ఫ్‌రిపోర్టింగ్ చేశారు. రెండో దశ దోస్త్‌లో 358 మందికి సీట్లు కేటాయించారు. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో మొత్తం సీట్లు 480కి మొదటి దశలో 139 మందికి 86 మంది సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయగా, రెండో దఫా దోస్త్‌లో 90 మందికి సీట్లు అలాట్ అయ్యాయి. సతుపల్లి డిగ్రీ కళాశాలలో మొత్తం సీట్లు 480కి గాను మెదటి దశ దోస్త్‌లో 34 మందికి సీట్లు ఎలాట్‌మెంట్ కాగా 31 మంది రిపోర్టింగ్ చేశారు. రెండో దశ దోస్త్‌లో 34 మందికి సీట్లు కేటాయించారు. మధిర డిగ్రీ కళాశాలలో మొత్తం సీట్లు 300కిగాను మెదటి దశ దోస్త్‌లో 31 మంది విద్యార్థులకు సీట్లు రాగా 28 మంది సెల్ఫ్‌రిపోర్టింగ్ చేశారు. రెండో దశలో 22 మందికి సీట్లు వచ్చాయి. నేలకొండపల్లి డిగ్రీ కళాశాలలో మొత్తం సీట్లు 300కి గాను మెదటి దశ దోస్త్‌లో 31 మందికి సీట్లు రాగా 28 మంది రిపోర్ట్ చేశారు. రెండో దశలో 33 మంది విద్యార్థులకు సీట్లు వచ్చాయి. కాగా రెండో దశలో ఎంతమంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేస్తారన్నది తెలియాల్సి ఉంది.

ప్రవేటు కాలేజీల నజరానాలు

అడ్మిషన్ల కోసం ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమాన్యాలు నజరానాలు ఎరచూపుతున్నాయి. 'మా కాలేజీలో చేరండి.. రూ.6 వేలు డబ్బులే తీసుకోండి, మీతో పాటు మీ ఫ్రెండ్స్ నో బంధువులనో మరో నలుగురిని జాయిన్ చెయ్యండి.. మంచి స్మార్ట్ ఫోన్ ను కూడా సొంతం చేసుకోండి. .' అని ఆఫర్లు ఇస్తున్నారు. కళాశాలల మధ్య పోటీ ఉండడంతో నేరుగా కాలేజీలు విద్యార్థులకే వలవేసి డబ్బులు, మొబైల్‌ఫోన్లు ఎర చూపుతున్నారు. మరి కొన్ని కాలేజీలు ఇంటర్మీడియట్ కళాశాలలతో సంబంధాలు పెట్టుకొని ఆ కాలేజీలో పాసైన విద్యార్థులను డిగ్రీ కాలేజీలో చేర్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. కొన్ని కాలేజీలు నగదుతో పాటు, ఉచిత బుక్స్, యూనిఫామ్స్, బస్సు ప్రయాణంతో పాటు, స్కాలర్‌షిప్ లు కూడా విద్యార్థులకే ఇస్తామని ఆఫర్ ఇస్తున్నాయి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో కంటే ప్రైవేటులోనే అడ్మిషన్లు అధికంగా అవుతున్నాయి.

గురుకుల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం

» ఇల్లెందులో బస్టాండ్‌లో గుర్తించిన కుటుంబ సభ్యులు

బూర్గంపాడు, జూన్ 25: కొత్తగా గురుకుల పాఠశాలలో చేరిన ఐదో తరగతి విద్యార్థిని నాలుగు రోజులకే పాఠశాలలో కనిపించకుండాపోయి అందరినీ కంగారు పెట్టింది. పాఠశాల నుంచి వెళ్లిన సదరు విద్యార్థిని ఇల్లెందులో కనిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడులో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన లొక్యశ్రీ అనే విద్యార్థిని నాలుగు రోజుల క్రితం బూర్గంపాడులోని బాలికల గురుకుల పాఠశాలలో చేరింది. అయితే ఐదో తరగతి చదువుతున్న లొక్యశ్రీ మంగళవారం ఉదయం పాఠశాలలో కనిపించలేదు.

ఈ విషయాన్ని గుర్తించిన పాఠశాల సిబ్బంది ప్రిన్సిపాల్ తాతారావుకు సమాచారం అందించారు. దీంతో ప్రిన్సిపాల్ బాలిక తల్లిదండ్రులను అప్రమత్తం చేసి బూర్గంపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత విద్యార్థిని కోసం వెతుకుతుండగా ఆమె ఇల్లెందు బస్టాండులో కనిపించడంతో కుటుంబసభ్యులు బాలికను పాఠశాలకు తీసుకవచ్చారు. బాలిక ఆచూకీ లభ్యం కావడంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. అయితే పాఠశాల నుంచి ఎందుకు వెళ్లిందని బాలికను ప్రశ్నించగా ఆమె ఎటువంటి సమాధానం చెప్పలేదు. కొత్తగా గురుకులంలో చేరడంతో భయం వల్ల వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు.

జర్నలిస్టు బస్‌పాస్‌ల గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 25: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టుల బస్‌పాస్‌ల గడువును తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పొడిగించింది. ఈ నెల 30వ తేదీతో బస్ పాసుల గడువు ముగుస్తుండటంతో మరో మూడు నెలలు పొడిగించింది. జూన్ 30 నుంచి సెప్టెంబరు 30, 2024 వరకు అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని ప్రభుత్వం పొడిగించటంతో బస్‌పాసుల కాలపరిమితిని కూడ టీజీఎస్ ఆర్టీసీ పొడిగించింది. రాయితీ బస్ పాసుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించింది. గతంలో ఆన్‌లైన్లో చేసిన విధంగానే ఈ దఫా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన జర్నలిస్టులకే బస్‌పాసులు ఇస్తామని టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. ఆన్‌లైన్లో జర్నలిస్టుల వ్యక్తిగత వివరాలు, ఫొటో, అక్రిడిటేషన్ కార్డులను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. బస్‌పాస్ సెంటర్‌ను ఎంపికచేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను సమాచార పౌరసంబంధాల శాఖ ఆన్‌లైన్లో ధ్రువీకరించిన అనంతరం బస్‌పాసులను టీజీఎస్ ఆర్టీసీ జారీ చేస్తుంది.

ప్రజాస్వామ్యంపై 'చీకటి రోజు'

» ఎమర్జెన్సీ కాలాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నిరసన



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 25: ఇందిరాగాంధీ 1975లో దేశంలో ఎమర్జెన్సీప్రకటించడం ప్రజాసంఘంపై చీకటిరోజుగా బీజేపీ రాష్ట్ర నాయకులు సారంగుల అమర్‌నాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు కేవి. రంగాకిరణ్‌లు అభివర్ణించారు. మంగళవారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిరసన నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటి అక్కడి నుంచి నల్లరిబ్బెన్లు మూతికి కట్టుకుని పోస్టాఫీస్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగాన్నే అవమాన పర్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏకపక్షంగా అత్యవసర స్థితిని విధించి 1975-77 మధ్య కాలంలో 21 నెలలను ఎమర్జెన్సీ విధించడం సిగ్గుచేటన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకించిన వారిని జైలుకు పంపి ఇబ్బందులకు గురి చేయడం వారి నియంతృత్వానికి అద్దంపట్టిందన్నారు. భారతదేశ చరిత్రలోనే వివాదస్పదమైన ఎమర్జెన్సీని భావితరాలకు తెలియచేసేందుకు మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ రంగాకిరణ్, మునుగు శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, యర్రం రాజు బెహరా, బిజ్జం శ్రీనివాసరెడ్డి, నిర్మల, శ్రీధర్, బాలరాజు,టి. నరేంద్రబాబు, రాజేశ్వరరావు, గుమలాపురం సత్యనారాయణ, మాధవ్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తనిఖీలు



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 25: ఖమ్మం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు తనిఖీలు నిర్వహించారు. ఓ ఆస్పత్రిపై ఫిర్యాదులు రావడంతో దాని అనుమతులను, ఫార్మసీకి ఉన్న అనుమతులను పరిశీలించారు. ఈసందర్భంగా అనుమతులకు దరఖాస్తు చేశారని, ఫార్మసీకి మాత్రం ఇంకా అనుమతులు రావాల్సి ఉందనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో జిల్లా వైద్యాధికారి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్ పాల్గొన్నారు.

మా హెచ్‌ఎం మాకు కావాలి..

» సిరిపురం ప్రైమరీస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా



సిరిపురంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మధిరరూరల్, జూన్ 25: ఉద్యోగోన్నతిపై వేరే స్కూల్‌కు వెళ్లిన ఉపాధ్యాయుడే తమకు కావాలని పూర్వ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇప్పటివరకు తమ పాఠశాలలో పనిచేసి ప్రమోషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లిన హెచ్‌ఎంను తిరిగి తమ పాఠశాలకు నియమించాలని కోరుతూ ఖమ్మం జిల్లా మధిర మండలం సిరిపురం ఎస్సీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం గ్రామంలో ధర్నా చేశారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎం సూర్యదేవర శివరామకృష్ణ 13సంవత్సరాల పాటు పనిచేసి ప్రమోషన్‌పై ఐదురోజుల క్రితం నిధానపురం ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. ఆయనతో పాటు ఇక్కడ పనిచేసిన మరో టీచర్ కూడా ప్రమోషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లారు. అయితే హెచ్‌ఎం శివరామకృష్ణ విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు క్రమశిక్షణ, ఆటపాటలు అన్నింటిలోనూ మేటిగా తయారు చేశారు. పాఠశాలను సొంత ఇంటిలా చూసుకునేవారు. దీంతో సిరిపురం గ్రామంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆయనకు మంచి ఆదరణ ఉంది. అయితే ఐదురోజుల క్రితం హెచ్‌ఎం శివరామకృష్ణ వేరే పాఠశాలకు వెళ్లడంతో కాలనీలోని విద్యార్థులు వారి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. 'మా హెచ్‌ఎం మాకే కావాలి' అంటూ నినాదాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సిరిపురంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు కనకపూడి పెద్దబుచ్చయ్య, కనకపూడి శ్రీను, యంగల ఆనంద్ మాట్లాడుతూ గ్రామంలోని కాలనీలో విద్యార్థులకు బాగా పాఠాలు చెప్పి హెచ్‌ఎం శివరామకృష్ణ ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని, ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. అందువల్ల జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రమోషన్‌పై వెళ్లిన హెచ్‌ఎంను తిరిగి తమ పాఠశాలంనే నియమించాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచే సమస్యను ఎంఈవోకు వివరించారు.

కొత్త సార్ ముందు ఎన్నో సవాళ్లు!

(5వ పేజీ తరువాయి)

పేరుతో 40కి పైగా స్థలాలు అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగాయి. ఈ స్కామ్‌ను కూడా ఆంధ్రజ్యోతి ఆధారాలతో సహా ప్రచురించింది. ఆ సమయంలోనూ విచారణ నిర్వహించిన అధికారులు ఒక్కటే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను రద్దు చేశారు. మరికొన్ని స్థలాలకు సంబంధించి కూడా దొంగ అసెస్‌మెంట్లు వేసి, వాటిద్వారానే అక్రమ క్రమబద్ధీకరణ చేయించుకున్నట్టు తేలింది. కాని మిగిలిన వాటిపై మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత సెక్షన్‌లో ఉన్న అధికారులను ఇతర సెక్షన్‌కు మార్చారు తప్ప వారిపై శాఖా పరమైన విచారణ లేనిపరిస్థితి నెలకొంది. 59 జీవో అక్రమాలకు మూల కారణం దొంగ అసెస్‌మెంట్లే అని తేలినప్పటికీ క్రమబద్ధీకరణ చేయించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకున్నారు తప్ప, బాధ్యులుగా ఉన్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వేలిముద్ర వారినీ 'కేటగిరీ-2'కు మార్పు

పీఆర్సీ సమయంలో అధికారులు ఎలాంటి సర్టిఫికేషన్ వెరిఫికేషన్ లేకుండానే తమకు అనుకూలంగా ఉండే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కేటగిరీలను మార్చి జీతాలను పెంచారన్న ఆరోపణలున్నాయి. కేటగిరి-1 లో రూ. 12వేల జీతం ఉండగా, కేటగిరీ-2లో రూ. 15వేల జీతం ఉంటుంది. అయితే కేటగిరీ-2 కు సంబంధించి ఆయా ఉద్యోగులు టెక్నికల్ సర్టిఫికేట్లను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలాంటి సర్టిఫికేట్లు లేకుండానే సుమారు 350 మందిని కేటగిరి 2లో లిస్టులో చేర్చి జీతాలు పెంచారు. దీంతో ఆయా ఉద్యోగులకు ఓ సంస్థ ద్వారా మూడు రోజులపాటు శిక్షణ కల్పించగా.. ఆ సర్టిఫికేట్లు నేటివరకు రాకపోవడం గమనార్హం. అయితే శిక్షణ సమయంలో శిక్షణనిచ్చిన సంస్థకు నగదు చెల్లించాలంటూ మొదట ఆయా ఉద్యోగుల జీతాల్లో కోత వేయగా, విషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో తిరిగి ఉద్యోగుల అకౌంట్లలో జమ చేసినట్టు తెలిసింది. అయినప్పటికీ కొందరు మధ్యవర్తులు మాత్రం అనధికారికంగా సుమారు రూ. 10 లక్షల వరకు సంబంధిత కాంట్రాక్టు కార్మికుల దగ్గర నుంచి వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా కేటగిరీ2కు అర్హులైన వారు ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి తమకు అనుకూలంగా ఉన్న వారిని మాత్రమే కేటగిరి-2 చేర్చినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. రెండో కేటగిరిలోకి మారిన వారిలో చాలమంది వేలిముద్ర వేసేవారుండటం గమనార్హం.

అక్రమ నిర్మాణాల్లో అధికారుల హస్తం...

ఖమ్మం నగరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన కార్పొరేషన్ అధికారులు వాటిని పట్టించుకోకుండా వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు మంజూరు చేసేటప్పుడు సర్వే నెంబర్లతో పాటుగా, ప్రభుత్వ ఎన్నెస్పీ భూములు వంటి పదుల రకాల అంశాలను పరిశీలించాల్సి ఉండగా, వాటిని పట్టించుకోకుండా అక్రమార్కులకు కొమ్ముకాశారన్న విమర్శలు లేకపోలేదు. ఎక్కడో ఉన్న సర్వే నెంబరు పేరుతో మరో సర్వే నెంబరులో నిర్మాణాలు చేస్తున్నప్పుడు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నప్రకారం అనుమతులు ఇవ్వడం కుదరని స్థలాలకు లోకేషన్ మార్చి దర్జాగా అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఈ అనుమతుల మంజూరులో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక అపార్ట్‌మెంట్లకు అనుమతులు ఇచ్చే సమయంలో కార్పొరేషన్ కార్యాలయానికి మార్టిగేజ్ చేసి ఉన్న ప్లాట్లను సైతం దర్జాగా విక్రయిస్తున్నప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

రాజకీయ జోక్యమే కారణమా?

కార్పొరేషన్ కార్యాలయంలో ఏ అధికారిని ఏ సెక్షన్‌లో ఉంచాలి..? ఏ అధికారిపై చర్యలు తీసుకోవాలి..? అక్రమాలను ఎలా కప్పి పుచ్చాలి..? వంటి పలు అంశాల్లో అంతర్గతంగా రాజకీయ జోక్యం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. పదుల సంఖ్యలో అక్రమాలు వెలుగులోకి వచ్చి నెలల సమయం దాటుతున్నప్పటికీ అవన్నీ విచారణ దశలోనే ఉండటమే దానికి బలం చేకూరుస్తోంది. గతంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లోనూ తిలాపాపం.. తలాపిడెకెడు అన్నట్టుగా.. కొందరు కార్పొరేటర్లు తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులను ఉద్యోగాల్లో పెట్టించినట్టు ఆరోపణలు లేకపోలేదు. ప్రస్తుతం అవి వెలుగులోకి వచ్చినప్పటికీ వాటిపై విచారణ జరగకుండా, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా వారు అడ్డుపడుతున్నారన్న వాదన లేకపోలేదు. అంతేకాదు గతంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించినవారిదే కార్పొరేషన్‌లో పెత్తనంగా మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్య ఆయా విచారణలన్నీ పూర్తి చేసి కార్పొరేషన్‌ను ప్రక్షాళనచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మధిర రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం


» రూ.25కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం భారతీష్ కుమార్ జైన్

మధిర, జూన్ 25: సౌత్‌సెంట్రల్ రైల్వే డివిజినల్ మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ మంగళవారం మధిర రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. మధిరలో 25కోట్లతో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. స్టేషన్ ఆవరణ, ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న వెయిటింగ్ హాలు, ఇతర స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే మూడోరైల్వే లైన్ నిర్మాణపనుల పురోగతిని పరిశీలించారు. డీఆర్ఎం విజయవాడ నుంచి కాజీపేట పర్యటనలో బాగంగా జరుగుతున్న మూడోరైల్వే లైన్ పనులను ప్రతి స్టేషన్‌లోనూ తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్వే కారులో వచ్చిన డీఆర్ఎంకు రైల్వే స్టేషన్ మేనేజర్‌తోపాటు, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌పీఎఫ్ అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈసందర్భంగా మధిర వచ్చిన డీఆర్ఎంను బీజేపీ నేతలు కలిసి మధిరలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మధిరలో నవజీవన్, లక్నో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని, కరోనాకు ముందు మధిరలో హాల్టింగ్ ఉన్న అన్ని ఎక్స్‌ప్రెస్‌లకు యథావిధిగా హాల్టింగ్ ఇవ్వాలని, ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలని, మధిరలో అండర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, మండల అధ్యక్షుడు గుండా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు



రామాలయంలో రిటైర్డ్ మేజర్ జనరల్ ఆర్‌కే సింగ్

భద్రాచలం, జూన్ 25: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర ఎల్‌డబ్ల్యూఈ సలహాదారులు, రిటైర్డ్ మేజర్ జనరల్ ఆర్‌కే సింగ్ రామయ్యను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ సాయి మనోహర్, దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వేద పండితులు మల్లారి రవికుమార్ శర్మ ఉన్నారు. అలాగే ఏపీలోని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్‌రాజు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు వారు నిర్వహించారు. ఇదిలా ఉండగా మంగళవారం ఆలయ ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.



తరలించడానికి సిద్ధం చేసిన యాష్‌పాండ్ పైపులు(ఫైల్)



భూగర్భంలోని విలువైన కేబుల్స్‌ను ఎక్స్‌కవేటర్‌తో వెలికితీస్తున్న దృశ్యం(ఫైల్)

కేటీపీఎస్‌లో ఆగని స్ర్కాప్ దందా

- తరలింపులో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- కోట్ల రూపాయల విలువైన సామగ్రి మాయం
- టెండర్ ఖరారులోనూ గోల్‌మాల్
- నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్న అధికారులు
- ప్రభుత్వం మారినా అక్రమార్కులపై చర్యలు శూన్యం
- అవినీతి అధికారులకు జెన్‌కో ఉన్నతాధికారులు

పాల్వంచ, జూన్ 25: తెలంగాణ రాష్ర్టానికి తలమానికంగా ఉన్న కేటీపీఎస్ కర్మాగారం ప్రస్తుతం అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కేటీపీఎస్‌లోని కొందరు అధికారులకు జెన్‌కో ఉన్నతాధికారుల సపోర్ట్ ఉండటంతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఉత్పాదన కోసం సంస్థలో కోట్ల రూపాయల విలువ చేసే పనిముట్లు, యంత్రాలు, కేబుల్స్ వినియోగిస్తుంటారు. వీటిలో విలువైన సామగ్రిని స్ర్కాప్ పేరుతో బయటకు తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. సంస్థ సంపదను దోచుకుపోతున్న వారికి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో బీజం పోసుకున్న స్ర్కాప్ తరలింపు స్కామ్ పట్ల ప్రస్తుతం ప్రభుత్వంలోని అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొత్తంగా కేటీపీఎస్ పాత ప్లాంట్ కూల్చివేత పనులు, టెండర్ ప్రక్రియ, అందులోని లోపాలు, కేటీపీఎస్ అధికారుల సహకారం, జెన్‌కో ఉన్నతాధికారుల మౌనం అనేక అనుమానాలకు, విమర్శలకు తావిస్తున్నది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కేటీపీఎస్ 7వ దశ పరిపాలన పరిధిలోకి వచ్చే ప్లాంట్(ఓఅండ్‌ఎం)ను 1966లో నిర్మించారు. అప్పటి నుంచి అది నిరంతరాయంగా పని చేస్తూ విద్యుత్ ఉత్పాదనలో రికార్డులు సృష్టించింది. కర్మాగారం నిర్మించి 58 ఏండ్లు గడిచినా నిర్మాణం జరిగిన నాటి నుంచి వినియోగిస్తున్న యంత్రాల సామర్థ్యం ఏమాత్రం దెబ్బతినలేదు. అయితే కాలక్రమంలో విద్యుత్ ఉత్పాదనలో సాంకేతికంగా అనేక మార్పులు రావడంతో గతంలో వినియోగించిన టెక్నాలజీని నిలిపివేసి, సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ప్రవేశపెట్టారు. నూతన దశలను నిర్మించి విద్యుత్‌ఉత్పత్తి కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో పాత ప్లాంట్‌ను కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి 2030 వరకు పాత ప్లాంట్‌ను కూల్చవద్దని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నా ఆగమేఘాలమీద నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం కొందరికి వరంగా మారింది. పాత ప్లాంట్ కూల్చివేత, అందులోని వివిధ రకాల వస్తువుల(ఐరన్, కాపర్, అల్యూమినియం,రబ్బర్, ప్లాస్టిక్, సిల్వర్)తో పాటు మెషిన్లు, ఇతర స్ర్కాప్‌ను తరలించడానికి టెండర్లు పిలిచారు. ముంబైకి చెందిన హెచ్‌ఆర్ అనే కంపెనీ రూ.485 కోట్లకు కాంట్రాక్టును దక్కించుకుంది. అయితే స్ర్కాప్ విలువ రూ.2వేల కోట్ల వరకు ఉన్నప్పటికీ, హెచ్‌ఆర్ సంస్థకు కారుచౌకగా కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

కూల్చివేత, స్ర్కాప్ తరలింపు ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్న తీరును గత ఏప్రిల్ మొదటి వారంలో ప్రత్యేక కథనాల ద్వారా 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. ఈ కథనాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. జెన్‌కో ఉన్నతాధికారులు ఈ విషయమై ఆరా తీసి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్టు కనిపించినా, ఫలితం మాత్రం కనిపించలేదు.

7వ దశలో అంతా గోప్యమే..

కేటీపీఎస్ 7వ దశలో ఏది జరిగినా గోప్యంగానే ఉంటోంది. ఇక్కడ ఓ ఉన్నతాధికారి ఏది చెబితే అదే శాసనం. ఆయన చేసిందే చట్టం. ఎవరైనా అతిక్రమిస్తే బదిలీ చేయడమే. ఆయనకు జెన్కో ఉన్నతాధికారుల అండదండలు పూర్తి స్థాయిలో ఉండటంతో తిరుగులేకుండా పోయింది. అందుకే కోట్లాది రూపాయల విలువైన స్ర్కాప్‌ను తరలించడానికి పాటించాల్సిన నియమ నిబంధనలకు పాతర వేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వాస్తవంగా పాత ప్లాంటులో భూమి పై భాగంలోని నిర్మాణాలను కూల్చడం, వాటిని తరలించడం వరకే టెండర్లలో పొందుపరచబడి ఉంది. కానీ సదరు అధికారి మాత్రం కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడ్డాడో, ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేశాడో, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గాడో తెలియదు కానీ టెండర్‌దారులకు పూర్తి స్థాయిలో సహకరించడంతో వారు భూగర్భంలోని విలువైన సామగ్రిని సైతం మాయం చేశారు.

ఆరా తీసిన ఎమ్మెల్యే కూనంనేని

కేటీపీఎస్ 7వ దశలో చోటుచేసుకుంటున్న అక్రమాలపై తాజాగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీరియస్ అయ్యారు. మూడు రోజుల క్రితం ప్లాంట్‌ను సందర్శించి స్ర్కాప్ తరలింపు ప్రక్రియలో వస్తున్న ఆరోపణలపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో సమాచారం అందించాలని, విచారణ జరుగుతున్నప్పుడు స్ర్కాప్‌ను ఎలా తరలిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు బహిర్గతమయ్యేవరకు స్ర్కాప్ తరలింపును నిలిపివేయాలని కోరారు. కానీ అధికారులు మాత్రం 'మా పని మేం చేసుకుపోతాం..' అన్న రీతిలో ఉండటంతో కాంట్రాక్టర్లు స్ర్కాప్‌ను తరలిస్తూనే ఉన్నారు.



స్ర్కాప్ తరలింపుపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

స్పందించని జెన్‌కో అధికారులు

ఇంత జరుగుతున్నా జెన్‌కో ఉన్నతాధికారులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. టెండర్ ప్రక్రియలో లోపాలున్నాయని, వందల కోట్ల సంస్థ సొమ్ము దొడ్డిదారిన అక్రమార్కుల పాలు అవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ఇటు కేటీపీఎస్ అధికారులు కానీ, జెన్‌కో ఉన్నతాధికారులు కానీ స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్ర్కాప్ తరలింపు ప్రక్రియపై గత ఏప్రిల్‌లో విచారణ కమిటీ వేశారు. కానీ ఆ విచారణ ఎంత వరకు వచ్చింది.. ఎప్పుడు పూర్తవుతుంది.. అనేది ఎవరికీ తెలియదు. సంస్థపై పలు ఆరోపణలు వస్తున్న క్రమంలో నిజానిజాలను తెలియజేయాల్సిన ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్

- అభిషేక్ అగస్త్యకు స్వాగతం పలికిన అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 25: ఖమ్మం నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిషేక్ అగస్త్య ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆ మేరకు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కాగా నూతన కమిషనర్‌ను నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్, ఏసీపీ వసుంధరతోపాటు డీఈలు, ఏఈలు, పారిశుధ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, రెవెన్యూ విభాగం అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కాగా, కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అభిషేక్ అగస్త్య మేయర్ పునుకొల్లు నీరజను ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మేయర్ పెండింగ్ పనుల గురించి కమిషనర్‌తో ప్రస్తావించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. దానికి స్పందించిన నూతన కమిషనర్ పెండింగ్ పనులను పరిశీలిస్తానని పేర్కొన్నారు.



ఖమ్మం నగరపాలకసంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అభిషేక్ అగస్త్య

అకౌంటెంట్ గారు.. లెక్కలు చూపించండి

నూతన కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన వెంటనే అభిషేక్ అగస్త్య నగరపాలక సంస్థ పరిస్థితిపై ఆరా తీశారు. అకౌంటెంట్ గారు... లెక్కలు చూపించండి అంటూ ఫైళ్లు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు.

ధరణిలో పెండింగ్ దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- పంటల కోసం ప్రత్యేక అప్లికేషన్
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మొబైల్‌యాప్ ద్వారా సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

కూసుమంచి, జూన్ 25: ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్ తెలిపారు. మంగళవారం కూసుమంచి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్ణీత గడువులోగా ధరణికి సంబంధించి అన్ని దరఖాస్తులు క్లియర్ చేయాలని తెలిపారు. అన్ని మాడ్యూల్స్‌లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నయో అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులకు అవసరమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

పంటల పరిస్థితి తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ ద్వారా సర్వే

జిల్లాలో పంటలు వేయని భూములకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం కూసుమంచిలో జిల్లా వ్యవసాయఅధికారి విజయనిర్మలతో కలిసి క్షేత్రస్థాయి సర్వేను తనిఖీ చేశారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా కూసుమంచిలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి పై కేసు

మధిరటౌన్, జూన్ 25: మధిర పట్టణంలో ఓ పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ సంధ్య తెలిపారు. మధిర ఎస్సీ కాలనీకి చెందిన బద్దె రాంకుమార్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించినందుకు అతనిపై 353, 323, 294బి, ఐపిసి సెక్షన్ 3 ఆఫ్ పిడిపిపి యాక్ట్ క్రింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం, జూన్ 25: మండలంలోని నరసాపురంలో మాధవి అనే మహిళ అక్రమంగా విక్రయిస్తున్న ఐదు లీటర్ల నాటుసారాను ఎక్సైజుశాఖ ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారాను విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలో నాటుసారా, నల్లబెల్లం, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. దాడుల్లో ఎస్‌ఐ సాయిరాం, హెచ్‌సీ హాలీంఖాన్, కానిస్టేబుళ్లు వీరబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చర్లలో గుర్తు తెలియని మృతదేహం

చర్ల, జూన్ 25: చర్ల మండల పరిధిలోని పడిదలమ్మ గండి సమీపంలోని పంట పొలాల్లో మంగళవారం సుమారు (25) ఏళ్ల వయసు ఉన్న యువతి మృత దేహాన్ని చర్ల పోలీసులు గుర్తించారు. యువతి ఒంటిపై నీలం, తెలుపు రంగు దుస్తులు ఉన్నాయి. నోటినుంచి నురగలు, మృత దేహం వద్ద మందు వాసన వస్తున్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. యువతి మందుతాగి ఆత్మహత్య చేసుకుందా, ఎవరైనా హత్య చేశారా, అన్న కోణంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిర్వహించి కేసు నమోదు చేశారు.

ఐరన్ చోరీ చేస్తూ పట్టుబడ్డ యువకుడు

ఇల్లెందు టౌన్, జూన్ 25: ఇల్లెందు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఐరన్‌బోర్డులను దొంగలిస్తున్న ఓ యువకుడ్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ప్రతిరోజు రాత్రి సమయంలో ఐరన్ బోర్డులను పీకి పక్కన పెడుతున్న యువకుడు ఉదయాన్నే దొంగలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు యువకుడ్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

జూలూరుపాడు, జూన్ 25: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఢీకొనడంతో మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన గంగావత్ మోజేస్ (20) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ పొలాన్ని దున్నేందుకు తండ్రికొడుకులు గంగావత్ రాము, మోజేస్‌లు కలసి ట్రాక్టర్‌ను తీసుకొని పొలానికి వెళ్లారు. తండ్రి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా కుమారుడు పొలంలోని ఓ చెట్టు కింద కూర్చున్నాడు. దీంతో తండ్రి రాము ట్రాక్టర్‌ను వెనక్కి తీసుకువస్తున్న క్రమంలో చెట్టు కింద కూర్చున్న కుమారుడు కనిపించకపోవటంతో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మోజేస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యచికిత్సలు అందించేందుకు ఆయనను కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు.

పోరాటంలో భాగస్వామ్యం కావాలి: సీపీ

ఖమ్మంక్రైం, జూన్ 25: మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఒకప్రకటనలో పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో మత్తుపదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరాలని, యాంటీడ్రగ్ సోల్జర్‌గా సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణకు వ్యతిరేకంగా వారంరోజులపాటు పట్టణాలు, మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ప్రజలు యువకులు, విద్యార్థులు కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అధికసంఖ్యలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని సీపీ ఆ ప్రకటనలో కోరారు.

తమ్ముడిపై అన్నావదిన దాడి

- పొలం వద్ద గడ్డికోస్తుండగా ఘటన
- ఉమ్మడి కుటుంబంలో భూవివాదమే కారణం
- సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స
- సత్తుపల్లి మండలం నారాయణపురంలో ఘటన

సత్తుపల్లిరూరల్, జూన్ 25: తమ్ముడిపై అన్నావదిన కొడవళ్లతో దాడి చేసి గాయపరిచిన సంఘటన సత్తుపల్లి మండలం నారాయణపు రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వంట్ల వెంకట సత్యనారాయణ తన ఉమ్మడి ఆస్తు లలో వచ్చిన వాటా 33సెంట్లలో వ్యవసాయం చేస్తుండగా అన్నావదినలు వంట్ల వెంకట అప్పారావు, వెంకట సత్యవతి గడ్డికోసే కొడవళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారు. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతుండగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని వైద్యులు సూచించారు.

దాడికి దారితీసిన వైనమిది

వంట్ల వెంకట అప్పారావు, వెంకటేశ్వరరావు, వెంకట సత్యనారాయణలు అన్నాదమ్ములకు చెందిన మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే పెద్దల సమక్షంలో 8ఏళ్ల క్రితం ఎకరం భూమిని పంచగా ఒకొక్కరికి 33సెంట్ల భూమి వాటాలుగా వచ్చింది. ఈ క్రమంలో అప్పటి నుంచి ఎవరికి వారు తమ భూములలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా క్షతగాత్రుడు వెంకటసత్యనారాయణ, మరో సోదరుడు వెంకటేశ్వరరావులు పాస్‌బుక్కులు చేయించుకోలేదు కానీ ఉద్యానవన శాఖ నుంచి సబ్సిడీపై పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. అయితే 6నెలల నుంచి తమకు చెందిన భూములను కాజేయ్యాలనే ఉద్దేశ్యంతో సాగుచేస్తున్న పామాయిల్ మొక్కలు, దొండ, ఇతర పంటలను పెద్ద సోదరుడు వెంటక అప్పారావు (దాడిచేసిన వ్యక్తి) ధ్వంసం చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గేదెలకు మేత కోసం గడ్డి కోసేందుకు క్షతగాత్రుడు వెంకట సత్యనారాయణ పొలంలోకి వెళ్లగా అన్నావదినలు నానాదుర్భషలాడుతూ విచక్షణారహితంగా కొడవళ్లతో దాడిచేసి గాయపరిచారు. వదిలేయ్యాలని ప్రాధేయపడిన వినిపించుకోలేదని, తమ భూములను లాక్కోవాలని, తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన అన్నావదినలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఇదే విషయమై పోలీసులను వివరణ కోరగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.



ఆర్టీసీ సేవలు విస్తృతం చేస్తాం: ఆర్‌ఎం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 25: భద్రాద్రి జిల్లాలో ఆర్టీసీ సేవలు విస్తృతం చేస్తామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.సరిరాం నాయక్ అన్నారు. మంగళవారం తొలిసారిగా భద్రాద్రి జిల్లా పర్యటనకు వచ్చి కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్లాట్ ఫాం, మరుగుదొడ్లు, రిజర్వేషన్ కౌంటర్, వ్యాపార సముదాయాలను, డిపో గ్యారేజ్‌లను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను నడిపించాలని సూచించారు. అదేవిధంగా బస్టాండ్ ప్రాంగణాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నాణ్యమైన సేవలను అందిస్తూ ప్రజల మన్నలను, రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచే విధంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం వెంట ఉమ్మడి జిల్లాల ఆర్టీసీ ఉద్యోగులు సీఐ శ్రీనివాసరావు, ఎం.ఎఫ్ శ్రావణ్‌కుమార్, టీఐ -3 సునీత, కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, డిపో ఉద్యోగులు వైఎస్.రావు, శామ్యూల్, తదితరులు ఉన్నారు.



కొత్తగూడెం బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం

ముగిసిన పోలీసు అధికారులు, సిబ్బంది శిక్షణ

కొత్తగూడెం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి ఉమెన్స్ కళాశాలలో నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొని మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న నూతన చట్టాల పట్ల ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి సబ్ డివిజన్‌లోని అధికారులు, సిబ్బందికి ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్తచట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని, కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తిస్థాయిలో అవగాహణ అవసరమన్నారు. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి అయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చన్నారు. ఈ తరగతుల ద్వారా శిక్షణను అందించిన సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్‌ఐ రాణా ప్రతాప్‌ను ఎస్పీ రోహిత్ సత్కరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

గొలుసు దొంగను పట్టిస్తే పారితోషికం

మధిర, జూన్ 25: తెలంగాణలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడి ఏపీలోని సరిహద్దు గ్రామాలకు పారిపోయిన వ్యక్తిని పట్టిస్తే తగిన పారితోషికం ఇస్తామని మధిర సీఐ మధు మంగళవారం ప్రకటించారు. ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో ఒక మహిళ మెడలో నుంచి సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని స్నాచింగ్ చేసిన దొంగ వెంకటాపురం, జమలాపురం, రెమిడిచర్ల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి పారిపోయినట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే వెంటనే మధిర సీఐ 8712659158, ఎర్రుపాలెం ఎస్‌ఐ 8712659164 నెంబర్లకు తెలియజేయాల్సిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తికి తగిన పారితోషికం ఇవ్వడం పాటు, అతని వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని సీఐ తెలిపారు.

సెల్ ఫోన్లను దొంగిలిస్తున్న యువకుడు

ఇల్లెందు టౌన్, జూన్ 25: రాత్రి సమయంలో ముసుకు వేసుకుని కార్మిక ప్రాంతాల్లో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి కేవలం సెల్‌ఫోన్లను మాత్రమే ఓ దొంగ దొంగలిస్తున్నాడు. ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ కార్మిక ప్రాంతాల్లో ఓ యువకుడు ఇళ్లలోకి చొరబడి అందుబాటులో ఉన్న సెల్‌ఫోన్లను ఎత్తుకుపోతున్నాడు. తన సెల్‌నెంబర్‌ను ఇంటి గోడలపై రాసి వెళ్లిపోతున్నాడు. సెల్ పోయినట్లు గుర్తించిన యజమానులు దొంగ సెల్‌నెంబర్‌కు ఫోన్ చేయగా ఫలానా చోట ఉన్న అక్కడికి వస్తే మీ సెల్ ఫోన్ ఇస్తానంటూ సమాధానం ఇస్తున్నాడు. సదరు వ్యక్తులు దొంగ చెప్పిన స్థలం వద్దకు వెళ్తుండగా వెంటనే సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేస్తున్నాడు. ఇలా గత వారం రోజులుగా కార్మిక ప్రాంతంలో దొంగ హల్‌చల్ చేస్తుండగా కార్మిక కుటుంబాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయమై ఇల్లెందు సీఐ బి. సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశామని, ఆకతాయి దొంగను అతిత్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..

16మంది ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డ వైనం

లక్ష్మీదేవిపల్లి, జూన్ 25: అధిక లోడ్‌తో ప్రయాణిస్తూ అదుపు తప్పి కల్వర్టులో ఆటో బోల్తాపడిన సంఘటన మంగళవారం సాయంత్రం లక్ష్మీదేవిపల్లి మండలం షైలారం గ్రామపంచాయతీ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బంగారుచెలక గ్రామపంచాయతీలోని చింతపెంటిగూడెంకు చెందిన గ్రామస్థులు వ్యవసాయ పనుల నిమిత్తం గట్టుమళ్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా షైలారం సమీపంలో ఆటో అదుపు తప్పి ఓ కల్వర్టులో బోల్తాపడింది. ఆటోలో 16మంది కూలీలు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. వీరిలో బొర్రా వీరబాబుకు తీవ్ర గాయాలు కాగా మిగతా వారు స్వల్ప గాయాలతో ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. గాయాలపాలైన వారిని మెరుగైన వైద్య చికిత్స కోసం కొత్తగూడెంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అత్యాశతో ఎక్కువమంది ప్రయాణీకులను ఎక్కించుకోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

మధిర నియోజకవర్గంలో రహదారులకు నిధులు

నియోజకవర్గంలో 13 రోడ్లు రద్దు

మధిర, జూన్ 25: మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గతంలో మంజూరైన 13బీటీ రోడ్లను ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో కొత్తగా 61.35 కిలోమీటర్ల మేర 22 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.58.20కోట్లు నిదులు మంజూరు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గత ఫిబ్రవరి నెలలో ప్రభుత్వం మంజూరు చేసిన 13రోడ్లను సర్వే అనంతరం రద్దు చేసింది. అదే స్థానంలో కొత్తగా మరో 22రోడ్లకు ప్రతిపాదనలు పంపగా రూ.58.20కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశంతో పీఆర్ అధికారులు గతంలో మంజూరు చేసిన రోడ్లను సర్వేచేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా ముదిగొండ మండలంలో మూడు రోడ్లు, చింతకాని మండలంలో ఒక రోడ్డు, ఎర్రుపాలెం మండలంలో ఒక రోడ్డు, బోనకల్ మండలంలో 5రోడ్లు, మధిర మండలంలో మూడు రోడ్లు మొత్తం 58.20కోట్ల రూపాయల 13రోడ్లను ప్రభుత్వం రద్దు చేసింది. వీటి స్థానంలో 22 రోడ్లు రూ. 58.20 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.

మధిర అగ్నిమాపక కేంద్రం అధికారిగా బాలకృష్ణ



మధిర, జూన్ 25: మధిర అగ్నిమాపక శాఖ అధికారిగా టీ బాలకృష్ణ నియమితులై మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాలకృష్ణ 2023లో ఎస్సై పరీక్షల్లో ఎంపికై హైదరాబాద్‌లోని ఎస్‌టీఐలో శిక్షణ పూర్తిచేసుకున్నారు. తొలి అపాయింట్‌మెంట్‌గా మధిర రావడంతో జాయిన్ అయ్యారు. ఎస్సై ఎంపికల్లో తాను ఫైర్ శాఖను ఇష్టపడి ఎంపిక చేసుకున్నానని తెలిపారు. అన్ని వేళలలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏమైనా అగ్నిప్రమాదం జరిగిన సమాచారం వచ్చిన వెంటనే స్పందిస్తానన్నారు. ప్రమాదాలపై ప్రజలకు, ముఖ్యంగా రైతులు, మహిళలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

వైరా రిజర్వాయర్ వెలవెల

- జూన్‌లోనూ గడ్డు పరిస్థితి
- 22సంవత్సరాల తర్వాత అడుగంటిన జలాశయం
- అగమ్యగోచరంగా ఆయకట్టు సాగు

వైరా,జూన్25: ఈఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమై జూన్‌నెల ముగియవస్తున్నప్పటికీ కూడా నీరు లేక మధ్యతరహాకు చెందిన వైరా రిజర్వాయర్ వెలవెలబోతుంది. దాదాపు 22సంవత్సరాల తర్వాత వైరా రిజర్వాయర్‌లో ఈపరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నీటిమట్టం కేవలం ఆరుఅడుగులుగా ఉంది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు ముందుగానే తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశిస్తాయని వాతావరణశాఖ చేసిన ప్రకటనకు భిన్నంగా ఆ రుతుపవనాలు చాలా బలహీనంగా ఉండటంతో వర్షాలు మొఖం చాటేశాయి. ఈ 20రోజుల్లో కేవలం మోస్తరుగా రెండు, మూడు వర్షాలే కురిశాయి. ఈ వర్షాలు కూడా అన్ని ప్రాంతాల్లో కురవడం లేదు. ఒక గ్రామంలో ఉన్న వర్షం పక్క గ్రామంలో పడటం లేదు. దాంతో కొన్ని గ్రామాల్లో వెదజల్లిన పెసర, జీలుగు విత్తనాలు మొలకెత్తగా మరికొన్ని గ్రామాల్లోని విత్తనాలు మొలకరాకుండా పోయాయి. విత్తిన పత్తి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇకపోతే 2002 ప్రాంతంలో ఈ రిజర్వాయర్ పూర్తిగా అడుగంటింది. నాటి పరిస్థితి 22ఏళ్ల తర్వాత పునరావృతమైంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు. అయితే ఇప్పుడు కేవలం ఆరు అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంది. గత ఏడాది జూలై చివరి వరకు వర్షాలు కురవనప్పటికీ రిజర్వాయర్‌లో నీటిమట్టం మాత్రం 12అడుగులకుపైగా ఉంది. ఇప్పుడు అది సగానికి సగం పడిపోయింది.



అడుగంటిన వైరా రిజర్వాయర్

వేసవికాలాన్ని తలపించే విధంగా ఎండలు ఉన్నాయి. దాంతో ఆవిరవుతున్న నీరు శాతం కూడా ఎక్కువగానే ఉంది. మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీటి అవసరాలకు ఉన్న నీటిని వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల పరిధిలోని 25వేల ఎకరాల ఆయకట్టులో సాగు అగమ్యగోచరంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్చరికల మేరకు గడిచిన యాసంగి పంటను రైతులు సాగుచేయలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులకు ఇప్పటివరకు నిరాశే మిగిలింది. కొద్దిరోజుల్లోనైనా వర్షాలు కురిసి రిజర్వాయర్ నిండితే తప్ప వైరా ఆయకట్టు సాగయ్యే అవకాశాలు కన్పించడం లేదు. దాంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నేడు జమలాపురం ఆలయ హుండీ లెక్కింపు

ఎర్రుపాలెం,జూన్25:జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షకుల సమక్షంలో భక్తులు శ్రీవారికి సమర్పించిన కానుకలు మొక్కుబడులను ధర్మకర్తలు, ఆలయ సిబ్బందితోపాటు శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు లెక్కిస్తారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఆ కార్యక్రమం ఉంటుందని, నిబంధనలకు లోబడి ఆసక్తి గలవారెవరైనా ఈ లెక్కింపులో పాల్గొనొచ్చునని తెలిపారు. లెక్కింపులో పాల్గొనదలచిన వారు నిర్ణీత సమయానికి ముందుగా పరిపాలన కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

- డీఈవో సోమశేఖరశర్మ

బోనకల్,జూన్25: విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని జానకీపురం, రావినూతల, ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముష్టికుంట్ల పాఠశాలలో 9,10 తరగతులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కొందరు విద్యార్థులు తెలుగులో ధారాళంగా చదవక పోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. తెలుగులో తడబాటు లేకుండా చదివేలా శ్రద్ధ వహించాలని సూచించారు. రావినూతలలో గణితం, సైన్స్ పాఠ్యంశాలలోని సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల సామర్థ్యాలు బాగుండటం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జానకీపురంలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. హాజరుశాతం బాగా తక్కువగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమయ పాలన పాటించి, మెరుగైన బోధన చేపట్టి విద్యాభివృద్ధికి దోహదపడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య ఉన్నారు.



ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న డీఈవో

రాష్ట్రంలో అడ్రస్ లేని ఆరు గ్యారెంటీలు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు

వైరా,జూన్25: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు రాష్ట్రంలో ఎక్కడా అడ్రస్ లేవని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు విమర్శించారు. మంగళవారం వైరాలో జరిగిన బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏఒక్కటీ అమలుచేయడం లేదని విమర్శించారు. వైరాలో వందపడకల ఆసుపత్రి నిర్మాణాన్ని సర్వేల పేరుతో సరిపుచ్చుతున్నారని ఆరోపించారు. 1975జూన్ 25న నాడు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నిరంకుశంగా భారత ప్రజలపై ఎమర్జెన్సీని విధించిందని దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కిలారు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌నాయక్, నాయకులు మనుబోలు వెంకటకృష్ణ, పాపగంటి నరేష్, చింతనిప్పు రామారావు, కోసూరి గోపాలకృష్ణ, ఏపూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినోద్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు

మధిర: జిల్లాలో గత ఎన్నికల పర్యటనలో తమ దృష్టికి వచ్చిన ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా జిల్లాలో ముందుకు సాగుతామని బీజేపీ పార్లమెంటరీ నేత తాండ్ర వినోద్‌రావు తెలిపారు. మంగళవారం మధిర వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం సంతోషంగా ఉందన్నారు. మధిర నియోజకవర్గంలో నాబార్డు ఆధ్వర్యంలో పార్మర్ ప్రాసెసింగ్ ఆర్గనేజేషన్ ఏర్పాటుచేసి రైతులకు అండగా ఉండేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, రామిశెట్టి నాగేశ్వరరావు, చావా కిరణ్, దోర్నాల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీవితాలను మార్చేది చదువే

సత్తుపల్లి బాయ్స్ హాస్టల్ సంక్షేమాధికారి

సత్తుపల్లిరూరల్, జూన్25: సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని, విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని ఎస్టీ బాయ్స్ హాస్టల్ సంక్షేమాధికారి బాణోత్ రాములు అన్నారు. 2024-25లో భాగంగా వసతి గృహంలోని 180 మంది విద్యార్థులకు ఆయన మంగళవారం నోట్‌బుక్స్, చద్దర్లు, టవల్స్, స్వెట్టర్స్, పెట్టెలు, కాస్మెటిక్స్ పంపిణీ చేశారు. ప్రతీ విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందని, చదువు చాలా గొప్పదని, దానికి కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవని విద్యార్థులకు వివరించారు.



పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాములు

నేటినుంచి నర్సింగ్ పరీక్షలు

ఖమ్మం కలెక్టరేట్, జూన్25: నేటి నుంచి జూలై 6 వరకు జనరల్ నర్సింగ్ మెడిసిన్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం నుంచి పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన వివిధ నర్సింగ్ కళాశాలలకు చెందిన 530 విద్యార్థులు ఈపరీక్షలను రాయనున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాలలో రెండు లెక్చర్ హాళ్లలో పరీక్షలను రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 12మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం లెక్చర్ హాళ్లలో సీసీ కెమెరాలు, జామర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు.

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా 28న ధర్నా

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మం సంఏమ విభాగం, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం దేశంలోని బొగ్గు గనులను దశల వారీగా ప్రైవేటీకరణ చేస్తోందని వాటిని అడ్డుకునేందుకు ఈనెల28న ఖమ్మంలో నిరసన ధర్నా కార్యక్రమం చేపడ్తామని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తర రాష్ట్రాల ప్రజలు బీజేపీని ఓడించినా మోదీ విధానాలు మారలేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. నాయకులు యర్రా శ్రీకాంత్, వై విక్రమ్, బోడపట్ల సుదర్శన్, నర్రా రమేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో క్రాంతి కాలేజీ విద్యార్థుల ప్రతిభ

వైరా, జూన్25: ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో వైరాలోని క్రాంతిజూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని కరస్పాండెంట్ సంక్రాంతి రవి కుమార్ తెలిపారు.జూనియర్ ఎంపీసీ విభాగంలో షేక్. షానియా, షేక్.రియాజ్ 470మార్కులకు 462 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో ఎం. గౌతమి 5000కు 470 మార్కులు, బైపీసీలో జి.భాగ్యలక్ష్మీ 440కు 422 మార్కులు సాధించారు. వీరిని రవికుమార్, చైర్మన్ సునీల్, డైరెక్టర్ సంయోగిత, ప్రిన్సిపాల్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

భాగం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థికి చేయూత



నగదును అందజేస్తున్న దాతలు

బోనకల్, జూన్25: మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభ చాటిన వేమా అరవింద్‌కు భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు రాధాకృష్ణ నగదు ప్రోత్సాహాన్ని తహసీల్దార్ పున్నం చందర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రతిభ చాటిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు భాగం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

సంగారెడ్డి చెరువును పరిశీలించిన అధికారులు

కల్లూరు, జూన్25: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో గల సంగారెడ్డి చెరువును మంగళవారం కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, జలవనరులశాఖ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. చెరువు పరివాహక ప్రాంతం, ముంపు భూములను, సాగర్ నీరు సరఫరా కెనాల్‌ను వారు పరిశీలించారు. సంగారెడ్డి చెరువు పరవాహక ప్రాంతానికి సంబంధించి మునక భూముల రైతులకు, ఆయకట్టు రైతులకు కోన్నేళ్లుగా వివాదం కోనసాగుతుంది. సంగారెడ్డి చెరువుకు సాగర్ ప్రధాన కాల్వపై నుంచి తూము ద్వారా నీరు సరఫరా అవుతుంది. ఈ తూము ద్వారా కొంతమంది వ్యక్తులు సాగర్ నీరు చెరువులోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తు అధికారులు ఫిర్యాదు చేశారు. మరో వైపున సంగారెడ్డి చెరువు ముంపు ప్రాంతాన్ని కొంత మంది రైతులు అక్రమంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయిలో ఆయా శాఖల తరుపున అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సాంబశివుడు,ఈఈ లక్ష్మీనారాయణ. డిఈ రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో

ఆరుగురు జూదరులు అరెస్ట్

కల్లూరు,జూన్25: కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు సమీపంలో జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు సమీపంలో గల మారుతి నగర్‌లో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఐ ఎస్‌కే షాకీర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సదరు ప్రదేశంలో రూ.1560 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకోని వారిని అరెస్ట్ చేశారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

కల్లూరు,జూన్25 మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానికంగా మువ్వా అనుచరుడు వేపూరి గణేష్ (చంటి) మంగళవారం రూ. 10 వేలు అందించారు. చెన్నూరుకు చెందిన షైలవరపు నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తన సహచర మిత్ర బృందం సమాచారం తెలుసుకున్నాడు. వెంటనే స్పందించిన గణేష్ (చంటి) వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో మువ్వా యువసేన సభ్యులు మన్నె చంటి, కొడవటి ఆశోక్, మాదాల నారాయణ, గంద్ర ఉపేంద్ర, బి సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్25: బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, నిర్మూలన సందర్భంగా ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కే రాంగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ ర్యాలీ నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మతవిశ్వాసాలకు కమ్యూనిస్టులు వ్యతిరేకం కాదు

- ప్రముఖ విద్యావేత్త బోడపట్ల రవీందర్

నేలకొండపల్లి, జూన్25: మతవిశ్వాసాలకు కమ్యూనిస్టులు వ్యతిరేకం కాదని, అన్ని మతాల విశ్వాసాలను కమ్యూనిస్టులు గౌరవిస్తారని ప్రముఖ విద్యావేత్త బోడపట్ల రవీందర్ అన్నారు. సీపీఎం నాయకుడు కట్టెకోల కోదండం 40వ వర్ధంతిని పురస్కరించుకుని బోదులబండలోని అంతోటి లక్ష్మయ్య నగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు సభలో మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన తరగతిలో రవీందర్ మాట్లాడుతూ హిందూ మతం అనేది ఒక జీవన విధానమన్నారు. విద్యార్థులు, యువత మనసులను మలినం చేసేలా, మత భావాలను ప్రేరేపించేలా పాఠ్యాంశాలను ప్రచురించటం దుర్మార్గమన్నారు. పార్టీ నిర్మాణంపై మండల కార్యదర్శి కేవీరెడ్డి తరగతి చెప్పారు. కార్యక్రమంలో భూక్యా కృష్ణ, ఏటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు, కట్టెకోల వెంకన్న, దుగ్గి వెంకటేశ్వర్లు, ఆలగడప అంజయ్య, పెద్దిరాజు నర్సయ్య, చింతలపాటి భాస్కర్, యలమద్ది లెనిన్, భూక్యా జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యావేత్త బోడపట్ల రవీందర్

బొల్లి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, జూన్25: చర్మంపై వచ్చే బొల్లి నివారణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని దీనిపై ప్రత్యేకంగా అవగాహన కలిగి ఉండాలని ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ బొల్లి దినోత్సవాన్ని నిర్వహించారు. చర్మంపై తెల్లని మచ్చలు కనిపిస్తే తక్షణమే వాటిని పరీక్షించి డాక్టర్ల సమక్షంలో మందులు వాడాలని సూచించారు. బొల్లి అనేది జన్యుమార్పిడి వలన కలిగే వ్యాధి అని వివరించారు. దీనిగురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇది అంటు వ్యాధి కూడా కాదన్నారు. ఒకరి నుంచి ఒకరికి సంక్రమించదని దీనిపై పూర్తి అవగాహనను పెంపొందించుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఆస్పత్రి వరకు ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డెర్మటాలజిస్ట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తులసి, తదితరులు పాల్గొన్నారు.



బొల్లిపై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

బెటర్‌మెంట్ ఫలితాల్లో శ్రీ నారాయణ హవా

సత్తుపల్లి, జూన్25: సత్తుపల్లిలోని శ్రీ నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బెటర్‌మెంట్ ఫలితాలలో హవా చూపించారు. ఎన్‌సీహెచ్. శ్రీసఖవరుణ్‌కు ఎంపీసీ గ్రూప్‌లో 470మార్కులకు గానూ 468మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్, టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. 467మార్కులతో అజయ్, ఆకాష్ గోవర్ధన్‌లు స్టేట్ సెకండ్, బైపీసీలో 440కిగానూ 429 మార్కులు సాధించిన సింధు టౌన్‌సెకండ్ ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ ఎన్‌సీహెచ్. రామకృష్ణమాచార్యులు, డైరెక్టర్ వనమారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజాకృష్ణ, కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



శ్రీసఖవరుణ్

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, జూన్ 25: ఈనెల 29, 30, తేదీల్లో ఖమ్మం నగరంలోని మంచికంటిహాల్లో నిర్వహించే ఖమ్మం రూరల్ మండల సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి నంద్రా ప్రసాద్ కోరారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో మంగళవారం ఆపార్టీ నాయకులతో సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద వెంకటరెడ్డి, ఊరడి సుదర్శన్‌రెడ్డి, నందిగమ కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి సంబాని పరామర్శ

తిరుమలాయపాలెం,జూన్25: మండలంలోని గోల్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే కరీంను మంగళవారం మాజీమంత్రి సంబాని చంద్రశేఖర్ పరామర్శించారు. కరీం ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయులు సమ్మయ్య, నజీర్ పాల్గొన్నారు.

తూటికుంట్లలో చేతిపంపు ప్రారంభం

బోనకల్,జూన్25:మండలంలోని తూటికుంట్లలో మంగళవారం హోప్ సొసైటీ ఆధ్వర్యంలో వేసిన బోర్‌ను ఎస్ఐ మధుబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుళ్లూరి రమేష్, మాజీ సర్పంచ్ నోముల వెంకట నర్సమ్మ, తుళ్లూరి కొండలరావు, తుళ్లూరి లక్ష్మీనర్సయ్య, పాపినేని వెంకటయ్య, పాపినేని అప్పారావు, వెంకట్రావ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే పనిచేయండి

సత్తుపల్లిరూరల్,జూన్25: ప్రభుత్వ పథకాలతో పాటు తమకు అప్పగించిన పనులను నిబంధనల ప్రకారమే పనిచేయాలని డీఆర్‌డీవో సన్యాసయ్య సూచించారు. మంగళవారం సత్తుపల్లిలోని స్రీశక్తి భవనాన్ని తనిఖీ చేశారు. అనంతరం రివ్యూ సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కేవీ.సుబ్బారావు, డ్వాక్రా ఈవో రత్నకుమారి, సీసీలు రామారావు, శ్రీనివాస్, కృష్ణ, నరేందర్, ఎమ్మెస్కే ఇందిర పాల్గొన్నారు.

ప్రీస్కూల్ పిల్లల హాజరు శాతం పెంచండి

సత్తుపల్లిరూరల్, జూన్25: అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ పిల్లల హాజరు శాతం పెంచేందుకు కృషిచేయాలని సత్తుపల్లి ఐసీడీఎస్ ఇన్‌చార్జీ సీడీపీవో రత్తమ్మ కోరారు. 2వరోజు సత్తుపల్లి ప్రాజెక్టు పరిధిలో పూర్వ ప్రాథమిక విద్యను ఎలా బోధించాలనే విషయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, మల్లేశ్వరి, కమల, మహాలక్ష్మీ, రమాదేవి, రజని, సూజాత, భవానీల పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలి

ఖమ్మంరూరల్, జూన్25: జూలై ఏడో తేదీన వరంగల్‌లో జరగబోయే మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పాలేరు ఇన్‌చార్జీ ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మద్దులపల్లిలో మంగళవారం సమావేశంలో మాట్లాడారు.ఈ సమావేశంలో వసంతరావు, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్25: చిన్నమున్నేరు వైకుంఠ ధామంలో అంత్యక్రియలకు వచ్చే శవాలకు చెందిన కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు తీసుకుని బొందలు తీసి సమాధులు నిర్మించే వారిపై ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాటికాపరి జాంబవంతుడు సొసైటీ అధ్యక్షుడు చెరుకుపల్లి బాలు కోరారు. మంగళవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొందలు తీసి శవాలు పూడ్చడంతో రాత్రి వేళల్లో కుక్కలు బొందలు తోడటంతో దుర్వాసన వస్తుందన్నారు. ఈ సమావేశంలో పంది వేణు, కె.సైదులు పడిశాల వీరస్వామి, కె.కాశయ్య, గట్టికొండ చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారం

రఘునాథపాలెం, జూన్25: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం జరుగుతాయని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం రఘునాథపాలెంలో నిర్వహించిన మండల రాజకీయ శిక్షణలో ప్రసంగించారు. పాలకులు మారినంత మాత్రాన ప్రజా సమస్యలు మారి పోవని, విధానాల ప్రాతిపదికన ప్రజల్ని చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి ఎస్ నవీన్‌రెడ్డి, నాయకులు యర్రా శ్రీను, మనోహర్, రహింఖాన్, వల్లూరి శ్రీనివాస్, కూచిపూడి నరేశ్‌కుమార్, తిరుపయ్య, నల్లమోతు నాగయ్య, మంగమ్మ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూమిలో రైతు కుటుంబంపై దాడి

రఘునాథపాలెం,జూన్25: వేపకుంట్ల గ్రామానికి చెందిన రైతు కుటుంబం శీలం విప్లవ్‌కుమార్, కళావతి దంపతులు శనివారం వ్యవసాయ పనులు చేస్తుండగా ఇదే గ్రామానికి చెందిన కొంతమంది మూకుమ్మడిగా కర్రలతో దాడి చేశారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు విమర్శించారు. గాయాలైన శీలం విప్లవ్‌కుమార్, కళావతి దంపతులను వేపకుంట్లలోని వారి నివాసాలకు వేళ్లి మాస్‌లైన్ నాయకులు మంగళవారం పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్ జిల్లా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, మేకా రామనాథం, కూరాకుల నర్సయ్య, గుడిగంటి బాబు, వీరబాబు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జాతీయ రహదారికి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలి

ఖమ్మంరూరల్, జూన్25: ఖమ్మం రూరల్ మండలం, మంగళగూడెం, తీర్థాల గ్రామాల మీదుగా వెలుతున్న నాగపూర్ టూ అమరావతి జాతీయరహదారికి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతరైతులు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డిని రైతులు కోరారు. ఆయా గ్రామాల రైతులు మంగళవారం మంత్రిక్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతుల సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని దయాకర్‌రెడ్డి తెలిపారు.